
సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
గురువారం । 7 । మార్చి । 2024



'కాళేశ్వరం' ముస్తాబు

మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకాళేశ్వర ముక్తీశ్వరాలయం ముస్తాబైంది. నేటి నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, శివ కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు.

- 8లో▸



సమాజహిత ఆవిష్కరణలు జరగాలి

సమాజానికి ఉపయోగపడే ఇంజనీరింగ్ ఆవిష్కరణలు జరగాలని కేయూ వీసీ ఆచార్య రమేష్ అన్నారు.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.0^0 /21.0^0

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత, ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సదరం క్యాంపునకు 114 మంది హాజరు

భూపాలపల్లి: జిల్లా కేంద్రంలో నిర్వహించిన సదరం క్యాంపునకు 120 మంది నమోదు కాగా 114 మంది హాజరైనట్లు డీఆర్‌డీఓ నరేష్ తెలిపారు. హాజరైన వారిలో ఆర్థో 56 మంది, వినికిడి లోపం ఉన్నవారు 18, మానసిక దివ్యాంగులు 21 మంది, విజువల్ ఇన్పాక్ట్ 19 మంది హాజరయ్యారు. మళ్లీ ఈ నెల 13, 20వ తేదీల్లో నిర్వహించే సదరం శిబిరానికి ఒకరోజు ముందు ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ సౌకర్యం కల్పించనున్నట్లు డీఆర్‌డీఓ తెలిపారు.

వాహనదారులు ధ్రువపత్రాలు కలిగి ఉండాలి

డీటీఓ సంధాని

భూపాలపల్లి: వాహనదారులు రవాణా వాహన త్రైమాసిక పన్ను, ఇతర వాహన పత్రాలు కలిగి ఉండాలని జిల్లా రవాణాశాఖ అధికారి (డీటీఓ) మహ్మద్ సంధాని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహన పన్ను, ఇతర పత్రాలు లేకుండా పట్టుబడితే 200శాతం జరిమానా విధించనున్నట్లు తెలిపారు. వాహనదారులు పన్నులు చెల్లించి అధికారులకు సహకరించాలన్నారు.

78 మంది గైర్హాజరు

భూపాలపల్లి రూరల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఇంటర్మీడియట్ నోడల్ అధికారి దేవరాజం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 8 పరీక్షా కేంద్రాల్లో 1,416 మంది విద్యార్థులకుగాను 1,338 మంది హాజరై 78 మంది గైర్హాజరయ్యారు. భూపాలపల్లి మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రాలను నోడల్ అధికారి దేవరాజం పరిశీలించగా, కాటారంలో జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యురాలు శరధృతి, ప్రత్యేక స్క్వాడ్ బృందాలు జిల్లాలోని మహదేవపూర్, చిట్యాల పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఎక్కడ కూడా మాల్ ప్రాక్టీస్ నమోదు కాలేదన్నారు.

హుండీల బహూకరణ



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి వారికి ఆలయానికి సిరొంచకు చెందిన నారాయన్ ఆగ్రో రైస్ మిల్లు వారు రెండు స్టీల్ హుండీలను బహూకరించారు. బుధవారం ఆలయ ఈఓ మారుతికి అప్పగించారు. వీటి విలువ రూ.75 వేలు ఉంటుందన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



భూపాలపల్లి: మిరాకిల్ వలంటీర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఐటీ మాస్టర్ కంప్యూటర్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్‌మేళాలో యుమామి ఫ్రెష్ అనే సంస్థలో వివిధ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారికి జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి (డీఈఓ) శ్యామల నియామక పత్రాలు అందించినట్లు ఐటీ మాస్టర్ కంప్యూటర్ సెంటర్ ఎండీ వేముల శంకర్ తెలిపారు. గొట్టిపాటి పృథ్వీ, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సౌకర్యాల లేమీ!

- ఉద్యోగ నోటిఫికేషన్లు పడటంతో గ్రంథాలయాలకు పెరుగుతున్న అభ్యర్థుల రద్దీ
- సరైన సౌకర్యాలు లేక నగరాలకు వెళ్తున్న నిరుద్యోగులు
- సదుపాయాలు కల్పించాలని వేడుకోలు



సౌకర్యాలు లేని జిల్లా గ్రంథాలయం

భూపాలపల్లి రూరల్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం గతంలో నిర్వహించిన పరీక్షల ఫలితాలను వెలువడించడమే కాకుండా కొత్తగా మెగా డీఎస్సీ, గ్రూప్–1 నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. త్వరలో మరో 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు ప్రకటించడంతో నిరుద్యోగులు మళ్లీ గ్రంథాలయాల వైపు వెళ్తున్నారు. అక్కడ అరకొర సౌకర్యాల నడుమ చదువుకోలేక ఆర్థికంగా ఉన్న వారు హనుమకొండ, హైదరాబాద్ లాంటి నగరాలకు కోచింగ్‌లకు వెళ్తున్నారు. ఆర్థికంగా లేని నిరుపేద విద్యార్థులు జిల్లాలోని గ్రంథాలయాల వైపు చూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 11 గ్రంథాలయాల్లో 57,758 పుస్తకాలు, 3,937 మంది సభ్యత్వాలు ఉన్నాయి. ఇందులో కేవలం 425 మంది పాఠకులు మాత్రమే గ్రంథాలయాలకు వస్తున్నట్లు లెక్కలు ఉన్నాయి. అద్దె భవనాల్లో అరకొర వసతులు, ఫర్నిచర్ కొరతతో గ్రంథాలయాలు నిరుపయోగంగా ఉన్నాయి.

ఫర్నిచర్ లేక..

భూపాలపల్లి పట్టణంలోని పాత గ్రామ పంచాయతీ భవనంలో నుంచి ఇటీవల జిల్లా గ్రంథాలయాన్ని పైలట్ కాలనీలోని సింగరేణి బ్యారెక్‌లోకి మార్చారు. గ్రంథాలయం విశాలంగా ఉన్నప్పటికి కుర్చీలు, రీడింగ్ టేబుళ్లు లేకపోవడంతో నిరుద్యోగ అభ్యర్థులు గ్రంథాలయానికి రావడానిక ఇష్టపడడంలేదు. దీంతో ఇద్దరు ముగ్గురు మాత్రమే చదుకునేందుకు వస్తున్నారు. దీంతో గ్రంథాలయం వెలవెలబోతుంది. ఈ గ్రంథాలయంలో 9,485 పుస్తకాలు ఉన్నప్పటికీ పుస్తకాలు పెట్టేందుకు సరిపోను ర్యాకులు లేక పోవడంతో పుస్తకాలు సంచుల్లోనింపి గదిలో ఉంచారు. అవి చెదలు పట్టే అవకాశం ఉందని అధికారులు తెలుపుతున్నారు. జిల్లా గ్రంథాలయంలో 10 కుర్చీలు, 4 రీడింగ్ టేబుళ్లు మాత్రమే ఉండడం గమనార్హం.

వేలాది పుస్తకాలు..

నిరుద్యోగులకు కాకుండా చదుకునే విద్యార్థులకే కాక ఉద్యోగాన్వేషణలో ఉన్న వారికి కావాల్సిన వేలాది పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. గ్రూప్స్, ఆర్‌ఆర్‌బీ, బ్యాంకింగ్ రిక్రూట్ మెంట్, పోలీస్, ఫారెస్టు పంచాయతీరాజ్, విద్య, వైద్యం తదితర రంగాలకు చెందిన ఉద్యోగాలకు నిర్వహించే పోటీ పరీక్షల పుస్తకాలు తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో అందుబాటులో ఉన్నాయి. కానీ ఫర్నిచర్ లేక పోవడంతో పుస్తకాలు సంచుల్లోనే గదిలో మూలకు ఉన్న పరిస్థితి ఉంది. అధికారులు, పాలకులు పట్టించుకొని ఫర్నిచర్ ఏర్పాటు చేస్తే నిరుద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

అద్దె భవనాల్లో...

జిల్లాలో 11 గ్రంథాలయాలు ఉండగా, అందులో 4 చల్లగరిగ, చిన్న కొడెపాక, గణపురం, చెల్పూరు గ్రంథాలయాలు సొంత భవనాల్లో కొనసాగుతుండగా, మొగుళ్లపల్లి, రేగొండ, కాటారం, మహదేవ్‌పూర్ గ్రంథాలయాలు అద్దె భవనాలు, చిట్యాల, భూపాలపల్లి, తాడిచెర్ల ఫ్రీ భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటికి పక్కా భవనాలు నిర్మించి డిజిటల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని పాఠకులు కోరుతున్నారు.

జిల్లాలో గ్రంథాలయాలు పాఠకులు, పుస్తకాల వివరాలు

గ్రంథాలయం	సభ్యులు	పాఠకులు	పుస్తకాలు
భూపాలపల్లి	299	60	9,485
కాటారం	55	30	5,311
గణపురం	453	30	6,232
చిట్యాల	232	35	7,119
చెల్పూరు	569	35	1,205
తాడిచెర్ల	202	30	4,960
మహదేవపూర్	395	25	6,871
మొగుళ్లపల్లి	311	30	5,639
రేగొండ	372	55	6,166
చల్లగరిగ	972	60	1,206
చిన్న కోడెపాక	77	35	3,564
	3,937	425	57,758

గ్రూప్–1కు ప్రిపేర్ అవుతున్న..



గ్రూప్–1కు ప్రిపేర్ అవుతున్న. రోజు గ్రంథాలయానికి వస్తుంటాను. పుస్తకాలు అన్ని ఉన్నాయి. ర్యాకులు లేకపోవడంతో పుస్తకాలు సంచుల్లో ఉన్నాయి. వాటిని వెతడం చాలా ఇబ్బంది అవుతుంది. కుర్చీలు, టేబుళ్లు లేక చాలా మంది గ్రంథాలయానికి రావడం లేదు.

- రమ్య, భూపాలపల్లి

సౌకర్యాలు కల్పించాలి..



గ్రూప్–1కు ప్రిపేర్ అవుతున్న. జిల్లా గ్రంథాలయంలో చాలా పుస్తకాలు ఉన్నప్పటికీ సగం ర్యాకులు లేక పుస్తకాలు సంచుల్లో ఉన్నాయి. ప్రభుత్వం, అధికారులు వేసవి కాలం సందర్భంగా గ్రంథాలయంలో తాగునీరు, ఫ్యాన్, కూలర్లు ఏర్పాటు చేయించాలి.

- ఏరువు రవళి, భూపాలపల్లి

దాతలు సహకరించాలి..



జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో పుస్తకాలు ఉన్నాయి. మౌలిక సదుపాయలు ఉన్నాయి. ఫర్నిచర్ కొరత ఉంది. రీడింగ్ టేబుళ్లు, ర్యాకులు, కుర్చీలు కావాల్సి ఉంది. దాతలు సహకరించి కుర్చీలు, టేబుళ్లు, ర్యాకులు ఏర్పాటు చేయాలి.

- శారద, జిల్లా లైబ్రేరియన్

గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలి



జిల్లాలోని గ్రంథాలయాల్లో పాఠకులకు, పోటీ పరీక్షలకు సిద్ధపడే వారికి (గ్రూప్స్ డీఎస్సీ) ఇతర పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలు, దినపత్రికలు, ఇతర పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పోటీ పరీక్షలకు సిద్ధపడేవారు గ్రంథాలయాలను ఉపయోగించుకొని తమ లక్ష్యాలను చేరుకోవాలి.

- చంద్రమౌళి, గ్రంథ పాలకుడు, జయశంకర్ భూపాలపల్లి

గొర్రెల స్కాంలో కదలిక!



గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాలపై ఆరా

- ఉమ్మడి వరంగల్‌లో పది మంది పాత్ర.. గతంలోనూ విచారించి వదిలేసిన 'విజిలెన్స్'
- ముగ్గురిపై చర్యలు.. పెండింగ్‌లో ఆర్‌ఆర్ యాక్టు
- 'కాగ్' నివేదిక, ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి ఏసీబీ
- గొర్రెల పంపిణీ యూనిట్లు, లబ్ధిదారుల వివరాల సేకరణ
- పశుసంవర్ధకశాఖలో మళ్లీ కలకలం

సాక్షిప్రతినిధి, వరంగల్:

గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన స్కాం ఓరుగల్లును తాకింది. రాష్ట్రవ్యాప్తంగా ఈస్కాంపై కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించడంతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దూకుడు పెంచింది. ఉమ్మడి జిల్లాలోనూ అవకతవకలు జరగడం.. 'కాగ్' నివేదిక, ప్రభుత్వ ఆదేశాల మేరకు అవినీతి నిరోధక శాఖ అధికారులు మొదటి, రెండో విడతల్లో పంపిణీ చేసిన యూనిట్లు, లబ్ధిదారుల జాబితా, నిధుల కేటాయింపు తదితర వివరాలు సేకరిస్తుండడం పశుసంవర్ధకశాఖలో చర్చనీయాంశంగా మారింది.

కొనుగోలు రోజే గొర్రెలు మాయం...

విజిలెన్స్ గుట్టువిప్పినా పట్టని 'ఫెడరేషన్'.

పథకం ఆరంభంలో శ్రద్ధ వహించిన ఉన్నతాధికారులు రానురాను మండల పశువైద్యాధికారులకే జీవాల కొనుగోలు బాధ్యత ఇచ్చేశారు. దీంతో గొర్రెలు లబ్ధిదారుల ఇంటికి చేరకముందే చేతులు మారాయి. కొన్నిచోట్ల ఇతర ప్రాంతాల నుంచి రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వరకు చేరుకొని, మళ్లీ తరలిపోయాయి. ఈ అక్రమాల తంతులో పలువురు మండల పశువైద్యాధికారులే కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలు వచ్చాయి. కొనుగోలుకు వెళ్లిన అధికారులు అటు అమ్మకందారులతో ఒప్పందం కుదుర్చుకొని తక్కువ ధర పలికే గొర్రెలకు ఎక్కువ ధర నిర్ణయించడం.. ఒక యూనిట్‌లో నాలుగు చిన్న పిల్లలను వేసి పెద్దవాటికి సమానంగా వెల కట్టినట్లు 'విజిలెన్స్' విచారణలో తేలాయి. ఉమ్మడి జిల్లాల్లో మొదటి విడతలో పంపిణీ చేసిన రాయితీ గొర్రెలను మెజారిటీ లబ్ధిదారులు వెంటనే అమ్మేయగా, కొన్నిచోట్ల రీసైక్లింగ్ చేసినట్లు వెల్లడైంది. వీటన్నింటిపై వెల్లువెత్తిన ఫిర్యాదులపై దృష్టి సారించిన అప్పటి ప్రభుత్వం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో విచారణ జరిపించి మొక్కుబడి చర్యలతో మమ అనిపించింది.

- జయశంకర్ భూపాలపల్లికి చెందిన డీవీఅండ్ఏహెచ్‌ఓ డాక్టర్ ఎం.బాలకిషన్, జనగామ జిల్లా బచ్చన్నపేట వీఏఎస్ డాక్టర్ కె.హరికిషన్‌లపై చర్యలకు అప్పటి విచారణ బృందం ఫెడరేషన్ ఎండీకి సిఫారసు చేసింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 10 మందిపై చర్యలకు సిఫారసు చేసినా.. తదుపరి చర్యలు, రెవెన్యూ రికవరీ యాక్టులు ఆగిపోయాయి.
- 2019 ఆగస్టులో వరంగల్ జిల్లా నుంచి ఎల్కతుర్తి ద్వారా అక్రమంగా తరలిస్తున్న ఐదు లారీలతో పాటు 574 గొర్రెలను అప్పట్లో పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా 13 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.
- చిల్పూర్ మండలం చిన్నపెండ్యాలలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన 12 యూనిట్లలో అవకతవకలు చోటు చేసుకోవడంతో అక్కడి పశువైద్యాధికారిని సస్పెండ్ చేశారు. మొదటి విడత గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ప్రత్యేక బృందాలు విచారణ జరిపి 10 మందిపై శాఖాపరమైన చర్యలకు ఆదేశించినా అది జరగలేదు. ఇలా చాలా సంఘటనలు జరిగినా మొక్కుబడి చర్యలతో మమ అనిపించారు. గొర్రెల పంపిణీ పథకంపై తాజాగా ఏసీబీ ఆరా తీస్తున్న నేపథ్యంలో ఈ అక్రమాల వెనుక అసలు సూత్రధారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మొదటి విడత 97 శాతం... రెండో విడత 9.6 శాతానికే బ్రేక్..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 575 సహకార సంఘాలున్నాయి. వీటిలో సుమారు 60 వేల మంది సభ్యులుగా ఉన్నారు. విడతల వారీగా అర్హులైన అందరికీ గొర్రెల పథకం ద్వారా లబ్ధి చేకూరేలా ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. 2017లో ఉమ్మడి జిల్లాకు మొదటి విడత (ఏ–లిస్టు)లో మొత్తం 50,678 యూనిట్లు మంజూరు చేసింది. ప్రతి యూనిట్‌కు 20 గొర్రెలు, ఒక పొట్టేలు చొప్పున జిల్లాల వారీగా కోటా నిర్ణయించి పంపిణీ చేశారు. ఇద్దరు ఏడీలు, ఒక డాక్టర్, ఇద్దరు పారా సిబ్బంది ఒక కమిటీగా మొత్తం ఉమ్మడి జిల్లాలో సుమారు 12 కమిటీల ద్వారా మహారాష్ట్రతోపాటు కడప జిల్లాలోని ఆరు మండలాల్లో గొర్రెలను కొనుగోలు ప్రక్రియ చేపట్టారు. వాటికి ఇన్సూరెన్స్ ట్యాగ్‌లు పూర్తయిన అనంతరం అక్కడి నుంచి వాహనాల ద్వారా జిల్లాకు పంపకుండా అక్రమాలకు పాల్పడ్డారు. మొదటి విడతలో పలుచోట్ల లెక్కలేనన్ని అవినీతి అక్రమాలు జరగడం.. అవి వెలుగు చూడటంతో 3,787 మంది లబ్ధిదారులకు పంపిణీ తర్వాత రెండో విడతకు బ్రేక్ పడింది.

ఎ–లిస్టు (మొదటి విడత)			
జిల్లా	మంజూరైన యూనిట్లు	గ్రౌండింగ్	శాతం
వరంగల్ అర్బన్	5,653	5,580	99
వరంగల్ రూరల్	12,793	12,793	100
మహబూబాబాద్	11,886	11,588	97
జేఎస్ భూపాలపల్లి/ములుగు	9,687	8,636	89
జనగామ	10,659	10,659	100
	50,678	49,256	97
బీ–లిస్టు (రెండో విడత)			
జిల్లా	మంజూరైన యూనిట్లు	గ్రౌండింగ్	శాతం
వరంగల్ అర్బన్	5,571	1,349	23
వరంగల్ రూరల్	12,748	77	01
మహబూబాబాద్	11,868	30	00
జేఎస్ భూపాలపల్లి/ములుగు	6,791	573	8
జనగామ	10,772	1,758	16
	47,750	3,787	9.6

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

రేగొండ: కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. నూతనంగా నియమించిన ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భిక్షపతితో పాటు 14 మంది ధర్మకర్తలు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మండలంలోని కొటంచ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వద్ద ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఈఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని శాఖలు బాధ్యతయుతంగా విధులు నిర్వహించాలన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఆదిలాబాద్‌లోని నా గోబా ఆలయాన్ని నిర్మించిన శిల్పితో కోటంచ గర్భగుడిని నిర్మిస్తామన్నారు. అనంతరం బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మంగీలాల్, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక విధానాలపై అవగాహన సదస్సు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా, అధికారులు

రేగొండ: రైతులకు ఆధునిక సాంకేతిక విధానాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన సదస్సును సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ భవేశ్‌మిశ్రా రైతులతో కలిసి మండల కేంద్రంలోని రైతు వేదికలో వీక్షించారు. ఎంపీపీ పున్నం లక్ష్మీ, తసీల్దార్ సత్యనారాయణ స్వామి, మండల ప్రత్యేక అధికారి శామ్యుల్, జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఉద్యానవనశాఖ అధికారి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్‌చైర్మన్ పదవి దక్కేదెవరికో?

- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య తీవ్ర పోటీ
- నేడు ఉదయం 11 గంటలకు ఎన్నిక

భూపాలపల్లి: భూపాలపల్లి మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ ఎన్నికపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. వ్యక్తిగత కారణాలతో వైస్ చైర్మన్ పదవికి కొత్త హరిబాబు గత ఏడాది డిసెంబర్ 13న రాజీనామా చేశారు. దీంతో మున్సిపల్ అధికారులు గత నెలలో ఎన్నిక నిర్వహించాలని భావించగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాల్లో ఉన్నందున, వాయిదా కోరారు. ఈ మేరకు నేడు (గురువారం) ఉదయం 11 గంటలకు ఎన్నిక తేదీని ప్రకటించారు. అయితే వైస్‌చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీలో మొత్తం 30 వార్డు స్థానాలు ఉండగా బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు 16 మంది, కాంగ్రెస్ 11, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఉన్నారు. బీఆర్‌ఎస్ నుంచి గెలుపొంది ఆ పార్టీ సస్పెండ్ చేయబడిన నాగవెల్లి సరళ, సీపీఐ ఒకరు, బీజేపీ కౌన్సిలర్ ఒకరు ఉన్నారు.

ఎవరికి దక్కేనో..

బీఆర్‌ఎస్‌కు 16 మంది కౌన్సిలర్లు ఉండగా, కాంగ్రెస్‌కు ఎక్స్ అఫిషియో సభ్యుడితో కలిసి 12 మంది ఉన్నారు. నాగవెల్లి సరళ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుండగా ఆ పార్టీ సంఖ్య 13కు చేరే అవకాశం ఉంది. బీజేపీ న్యూట్రల్‌గా ఉండగా, సీపీఐ పార్టీ కౌన్సిలర్ బీఆర్‌ఎస్‌తో టచ్‌లో ఉన్నట్లు సమాచారం. దీంతో వైస్‌చైర్మన్ పదవి బీఆర్‌ఎస్‌కు దక్కే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. కాగా బీఆర్‌ఎస్ పార్టీలోని పలువురు కౌన్సిలర్లు ఎన్నిక సమయానికి కాంగ్రెస్‌కు మద్దతు తెలిపే అవకాశాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. వైస్‌చైర్మన్ పదవికి బీఆర్‌ఎస్ కౌన్సిలర్ గండ్ర హరీష్‌రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సహకారంతో పార్టీ కౌన్సిలర్లతో హైదరాబాద్‌లో క్యాంపు ఏర్పాటు చేసినట్లు సమాచారం.



హరిబాబు ఇంటి వద్ద పోలీసులు,బీఆర్‌ఎస్ శ్రేణులు

హరిబాబు అరెస్ట్‌కు యత్నాలు..

మాజీ వైస్ చైర్మన్, కౌన్సిలర్ కొత్త హరిబాబును బుధవారం పోలీసులు అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించారు. హరిబాబుపై గతంలో పలు ఫిర్యాదులు రాగా, ఆయా కేసుల నిమిత్తం అరెస్ట్ చేసేందుకు ఉదయం 6 గంటలకే ఆయన ఇంటి వద్దకు వచ్చారు. అయితే హరిబాబు ఇంటి లోపలే ఉండి తలుపులు వేసుకొని బయటకు రాలేదు. మధ్యాహ్నం వరకు వేచి చూసిన పోలీసులు వెనుదిరిగారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకుల సహకారంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయారు.

ఎన్నికలో పాల్గొననివ్వండి..

- పోలీసులకు హైకోర్టు ఆదేశం
- మున్సిపల్ చైర్‌పర్సన్, ఇద్దరు కౌన్సిలర్లకు ఊరట

సాక్షి, హైదరాబాద్: భూపాలపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి, కౌన్సిలర్లు హరీశ్, హరిబాబులకు హైకోర్టులో ఊరట లభించింది. ఈ ముగ్గురిని అరెస్ట్ చేయవద్దని, నేడు (7న) జరిగే మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికలో వారిని పాల్గొనేలా చూడాలని పోలీసులను ఆదేశించింది. ఎన్నిక ముగిసిన తర్వాత చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చని సూచించింది. జనవరిలో తమపై భూపాలపల్లికి చెందిన రాజలింగమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారని, ఆ కేసులో ఇప్పుడు తమను అరెస్ట్ చేసే అవకాశం ఉందంటూ వెంకటరాణి, హరీశ్, హరిబాబలకు హైకోర్టును ఆశ్రయించారు. లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీబీ భాస్కర్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. ఎన్నిక ముగిసే వరకు అరెస్టు చేయవద్దని ఆదేశాలిచ్చారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మల్హర్: జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న సిబ్బంది పెండింగ్ వేతనాలు చెల్లించాలని రాష్ట్ర కారోబార్, బిల్ కలెక్టర్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి సాధుల శ్రీకాంత్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో నూతనంగా విధుల్లో చేరిన జిల్లా పంచాయతీ అధికారికి శ్రీకాంత్, కారోబార్ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీధర్‌తో కలిసి బుధవారం పుష్పగుచ్ఛం అందించి, వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 8 నెలలుగా జీతాలు రాక గ్రామ పంచాయతీ కార్మికులు అప్పులు తీసుకొని జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సమ్మెకాలనికి జీతం చెల్లించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్యాల శశికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యుడు తొలుకునూరి అశోక్, జిల్లా కమిటీ సభ్యులు మేదరి రాజేందర్, పూర్ణ, జిల్లెల్ల కుమార్, అబ్దుల్ ముతలిఫ్, సదాశివరెడ్డి, యుగేందర్, నరేష్ పాల్గొన్నారు.

నవ్విన నువ్వులు

- కేసముద్రం మార్కెట్‌లో క్వింటాకు రూ.12వేలు
- మద్దతుకు మించి రికార్డు ధరతో రైతుల్లో ఆనందం



కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం క్వింటా నువ్వులకు రికార్డు స్థాయిలో గరిష్ట ధర రూ.12,009 పలికింది. నువ్వులకు మద్దతు ధర రూ.8,635 ఉండగా, మద్దతుకు మించి ధర పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, మంగళవారం మార్కెట్‌కు వచ్చిన క్వింటా నువ్వులకు గరిష్ట ధర రూ.9,029 పలుకగా, బుధవారం అమ్మకానికి వచ్చిన నువ్వులకు గరిష్ట ధర రూ.12,009 పలికింది. నువ్వుల సాగు పూర్తిస్థాయిలో తగ్గిపోవడం మూలంగా, మార్కెట్‌లో నువ్వుల ధరలు పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు. కాగా కందులకు మద్దతు ధర రూ.7,000 ఉండగా, బుధవారం మార్కెట్‌కు 20 బస్తాల కందులు అమ్మకానికి వచ్చాయి. గరిష్ట ధర రూ.9,611, కనిష్ట ధర రూ.8,639 పలికింది. పెసర్లకు మద్దతు ధర రూ.8,558లు ఉండగా, గరిష్ట ధర రూ.8,689, కనిష్ట ధర రూ.7,433 పలికినట్లు మార్కెట్ అధికారులు వెల్లడించారు. బొబ్బెర్లకు క్వింటాకు గరిష్ట ధర రూ.7,333, కనిష్ట ధర రూ.6,839 పలికింది.

వరంగల్ మార్కెట్‌కు సెలవులు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా 8నుంచి 10వ తేది వరకు మూడు రోజులు ఉన్నందున మార్కెట్‌లో ఎలాంటి క్రయ, విక్రయాలు జరగవని మార్కెట్ ఉన్నతశ్రేణి సెక్రటరీ సంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తేదీ (శుక్రవారం)మహాశివరాత్రి, 9(శనివారం) శివరాత్రి జాగరణ సెలవు, 10వ తేదీ(ఆదివారం) వారాంతపు సెలవుతో మూడు రోజులు సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. ఈవిషయాన్ని సమస్త రైతు సోదరులు, వ్యాపారులు, గుమస్తాలు, దడవాయి, కార్మికులు గమనించి, సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

హసన్‌పర్తి: ప్రమాదవశాత్తు మిషన్ భగిరథ గేట్ వాల్‌కు ఏర్పాటుకు ఇనుప కంచెను ఢీకొట్టడంతో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఈఘటన పెగడపల్లి– గుండ్లసింగారం ప్రధాన రహదారిలోని గుంటూరుపల్లి వద్ద చోటు చేసుకుంది. ఈమేరకు మృతుడి భార్య సాంబలక్ష్మి బుధవారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి.. పెగడపల్లికి చెందిన పరికరాల రాజన్న(56) ఆటో నడపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాజన్న మంగళవారం రాత్రి ఆటో డ్రైవింగ్ చేసుకుంటూ పెగడపల్లి డబ్బాల మీదుగా గుండ్లసింగారం నుంచి ఇంటికి బయల్దేరాడు. గుంటూరుపల్లి సమీపంలో రోడ్డు పక్కన మిషన్ భగిరథ గేట్ వాల్‌కు ఏర్పాటు చేసిన ఇనుప కంచెను ఆటో ఢీకొంది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజన్నను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సాంబలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

అమ్మకు ఆసరా



కోమటిరెడ్డి సుశీలమ్మ అనాథ వృద్ధాశ్రమం

రూ.13కోట్లతో వృద్ధాశ్రమం

- అత్యాధునిక హంగులతో ఏర్పాట్లు
- తల్లి పేరిట ఎమ్మెల్యే కోమటిరెడ్డి దాతృత్వం
- ఎన్‌జీఓ, ప్రభుత్వ సహకారంతో సేవలు
- నేడు ప్రారంభోత్సవం

జనగామ: ఆరుపదుల వయస్సులో ఎవరి ఆదరణ లేని అనాథ బతుకులకు భరోసా కల్పిస్తున్నారు. అమ్మ ప్రేమను గుర్తుకు చేసుకుంటూ.. అనాథ తల్లులకు పెద్దకొడుకయ్యారు. భౌతికంగా తన తల్లి లేకున్నా.. ఆమె జ్ఞాపకాలను వృద్ధాశ్రమ రూపంలో చూసుకోవాలని తలచారు.. మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి. ఆయన తల్లి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా వృద్ధాశ్ర మ భవనం నిర్మించి ఆదరణ లేని తల్లులకు నీడనిచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందు కోసం రూ.13కోట్ల పైగా నిధులు ఖర్చు చేసి వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయగా.. ఆయన సతీమణి లక్ష్మి.. ఫౌండేషన్ చైర్మన్‌గా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

జనగామ మండలం సిద్దిపేట రోడ్డు శామీర్‌పేట శివారులో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తల్లి సుశీలమ్మ పేరిట అనాథ మహిళా వృద్ధాశ్రమం నిర్మించారు. రుద్రమ దేవి మహిళా సొసైటీ ఆధ్వర్యంలో ఉన్న భూమిని విరాళంగా ఇవ్వగా, భవన నిర్మాణం కోసం కోమటిరెడ్డి ముందుకొచ్చారు. మహానేత, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా అప్పట్లో భూమి పూజ చేయగా.. ప్రస్తుతం అనాథ వృద్ధులకు సేవలందించేందుకు సిద్ధమైంది.

126 మంది వృద్ధులకు సేవలు

మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న స్థలంలో ఎకరన్నరలో అనాథ ఆశ్రమం.. మరో ఎకరన్నరలో గ్రీనరీ, కూరగాయల తోటలు తదితరాలకు వినియోగిస్తున్నారు. ఇందులో 126మంది వృద్ధుల కోసం సౌకర్యాలు కల్పించారు. 8బ్లాక్‌లుగా విభజించి, 7వృద్ధులకు మరొకటి సిబ్బంది కోసం కేటాయించారు. ఒక్కో బ్లాక్‌లో 18మంది వృద్ధులు ఉండేలా ప్లాన్ చేశారు. ప్రతి బ్లాక్‌లో కేర్‌టేకర్ పర్యవేక్షణ 24గంటల పాటు ఉంటుంది. వృద్ధులకు అత్యవసర సమయంలో వైద్య పరీక్షలు అందించేలా డాక్టర్ సెల్ ఏర్పాటు చేశారు. ఎమర్జెన్సీ వార్డులో నాలుగు ఐసీయూ బెడ్లు, ఆక్సిజన్ సిలిండర్‌తోపాటు ఇద్దరు డాక్టర్లు, నలుగురు నర్సులు సేవలందిస్తారు. నిరంతర పర్యవేక్షణకు 80 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వృద్ధుల కాలక్షేపం కోసం ప్రత్యేక హాల్ నిర్మించి, అందులో భారీ ఎల్‌ఈడీ టీవీని అమర్చారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఏసీ కిట్లను అమర్చారు. అంబులెన్స్ వాహనం సైతం ఇస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వృద్ధాశ్రమంలో సగం మేర సోలార్ సిస్టం ద్వారా విద్యుత్ వినియోగించేలా చర్యలు చేపట్టారు. ఆశ్రమం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో సేంద్రియ పద్ధతులతో వరి, కూరగాయలు సాగు చేసేందుకు ఆలోచన చేస్తున్నారు.

నేడు ప్రారంభం

కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన మహిళా అనాథ వృద్ధాశ్రమం నేడు ప్రారంభం కానుంది. ప్రారంభోత్సవానికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు తదితరులు హాజరు కానున్నారు. ఇందుకు సంబంధించి కాంగ్రెస్ నాయకులు వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, కంచరాములు, రుద్రమదేవి సొసైటీ అధ్యక్షురాలు కవిత, దేవేందర్, మల్లేశం ఆశ్రమ ప్రాంగణంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆశ్రమంలో ఏర్పాటు చేసిన హాల్

మహిళా అనాథ వృద్ధాశ్రమం పరిశీలన

జనగామ మండలం శామీర్‌పేట శివారు పసరమడ్లలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన మహిళా అనాథ వృద్ధాశ్రమం గురువారం(నేడు) ప్రారంభ ఏర్పాట్లను బుధవారం అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పరిశీలించారు. ఆశ్రమంలో వసతి సౌకర్యాలు, కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి రాజగోపాల్ రానున్న నేపథ్యంలో నిర్వాహకులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ మేరకు రాష్ట్రం నుంచి వచ్చిన ఉన్నతాధికారులు శైలజ, ఏడీ రాజేందర్ కలెక్టర్‌తో చర్చించారు. డీడబ్ల్యూఓ జె.జయంతి తదితరులు పాల్గొన్నారు.



ఆశ్రమంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

‘పార్లమెంట్’ బరిలో బీఎల్‌ఎఫ్ అభ్యర్థులు

- ఫ్రంట్ రాష్ట్ర చైర్మన్ నల్లా సూర్యప్రకాశ్

వరంగల్ చౌరస్తా: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ వ్యాప్తంగా అన్ని స్థానాల్లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బీఎల్‌ఎఫ్) అభ్యర్థులు పోటీ చేస్తారని రాష్ట్ర చైర్మన్ నల్ల సూర్యప్రకాశ్ తెలిపారు. బుధవారం బీఎల్‌ఎఫ్ వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల ఎన్నికల సన్నాహక సమావేశం నర్ర ప్రతాప్ అధ్యక్షతన వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంపలోని ఓంకార్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. అవినీతి అవకాశవాద రాజకీయ అభ్యర్థులను ఓడించి, బీఎల్‌ఎఫ్ బలపరిచే అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని కోరారు.

కన్వీనర్ల నియామకం

వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల బీఎల్‌ఎఫ్ కన్వీనింగ్ కమిటీని రాష్ట్ర కన్వీనర్ వనం సుధాకర్ ప్రకటించారు. మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్‌గా కంచ వెంకన్న, కో కన్వీనర్‌గా బాబురావు, సభ్యులుగా వంగల రాగసుధ, గుండెబోయిన చంద్రయ్య, మేక మోహన్‌రావు, రాజమౌళి, బిచ్చానాయక్, ఉపేందర్‌ను నియమించారు. వరంగల్ పార్లమెంట్ కన్వీనర్‌గా నర్ర ప్రతాప్, కో–కన్వీనర్‌గా మాస్ సావిత్రి, సభ్యులుగా ఐతం నాగేష్, మంద రవి, కనకం సంధ్య, రవీందర్, జగదీశ్వర్, ఎమ్మెస్ రావు, అరుణ్ నాయక్‌లను ప్రకటించారు. గాదగోని రవి, గోనె కుమారస్వామి, రమేష్ హంసారెడ్డి, సునీల్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

ఉద్యోగులకు అండగా ప్రభుత్వం



డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, తదితరులు

- ఎమ్మెల్యే నాయినిరాజేందర్‌రెడ్డి

విద్యారణ్యపురి: ఉద్యోగుల సహకారంతోనే కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిందని ఉద్యోగులకు అండగా ప్రభుత్వం ఉంటుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో హనుమకొండ జిల్లా టీఎన్‌జీఓస్ యూనియన్ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం, నూతన సంవత్సరం డైరీ ఆవిష్కరణ, ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. డైరీని ఆవిష్కరించిన అనంతరం నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యేగా తన గెలుపులో ఉద్యోగుల పాత్ర ఎంతో ఉందని, కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, టీఎన్‌జీఓస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడారు. టీఎన్‌జీఓ కేంద్రసంఘం మాజీ అధ్యక్షుడు కారం రవీందర్ రెడ్డి, పరిటాల సుబ్బారావు, బైరి సోమయ్య, గనిపాక రాజకుమార్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా ఉద్యోగులు, జిల్లా నూతన కమిటీని సన్మానించారు.

ఇరువురికి పదేళ్ల జైలు శిక్ష

- గంజాయి అక్రమ రవాణా కేసులో తీర్పు

మహబూబాబాద్ రూరల్ : గంజాయి అక్రమ రవాణా చేస్తుండగా పట్టుబడ్డ కేసులో ఇద్దరికి పదేళ్ళు జైలు శిక్ష, రూ.2లక్షలు జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ బుధవారం తీర్పు వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి.. 2021 అక్టోబరు 29వ తేదీన 4కిలోల ఎండు గంజాయిని ఇద్దరు వ్యక్తులు రవాణా చేస్తుండగా మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కందికొండ క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఆ సమయంలో సీరోలు ఎస్సైగా ఉన్న సంతోష్ రావు గంజాయి అక్రమ రవాణా ఘటనలో కురవి మండలంలోని జుజ్జురి తండాకు చెందిన ధరావత్ పూల్ సింగ్, మహబూబాబాద్ మండలంలోని ఆర్లెళ్ల రామచంద్రు తండాకు చెందిన భూక్య రవిపై కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి మరిపెడ సీఐ సాగర్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా ప్రాసిక్యూషన్ పక్షాన జిల్లా కోర్టు పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు కోర్టులో వాదనలు వినిపించారు. కోర్టు లైజనింగ్ అధికారి, ఎస్సై వెంకటాచారి, ప్రస్తుత మరిపెడ సీఐ హత్తిరాం, సీరోలు ఎస్సై విజయరాం కుమార్ ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ అధికారులైన హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు రాము, రాజు, తాజీం పదమూడు మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలు విన్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ నేరం నిరూపణకాబడిన ఇద్దరు నేరస్థులకు ఒక్కొక్కరికీ పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

భార్యాభర్తలకు రెండేళ్లు..

నర్సింహులపేట: మానుకోట జిల్లా నర్సింహులపేట మండలంలోని వస్రాంతండాకు చెందిన భార్యభర్తలు లూనావత్ రాంసేట్, లూనావత్ బుజ్జికి రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ.. బుధవారం తొర్రూరు సివిల్ జడ్జి సరిత తీర్పు ఇచ్చినట్లు ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వస్రాంతండాలో 2018 సంవత్సరంలో ఇంటికి తీసుకున్న దారి విషయంలో లూనావత్ సూర్య, అతని భార్య గంగమ్మపై అతని తమ్ముడు రాంసేట్, భార్య బుజ్జిలు దాడికి పాల్పడడంతో కేసునమోదైంది. అన్న, వదినపై దాడి ఘటనలో నిందితులను తొర్రూర్ కోర్టులో హాజరుపరచగా నిందితులకు రెండు సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ.. మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు.

సమాజహిత ఆవిష్కరణలు జరగాలి





మాట్లాడుతున్న వీసీ రమేష్, వేదికపై రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ హాజరైన విద్యార్థులు

- కేయూ వీసీ రమేష్

కేయూ క్యాంపస్: సమాజానికి ఉపయోగపడే ఇంజనీరింగ్ ఆవిష్కరణలు జరగాలని కేవలం తరగతి గది, ప్రయోగశాలలకే పరిమితం కాకుండా సమాజాన్ని కూడా అధ్యయనం చేయాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అన్నారు. బుధవారం యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఆడిటోరియంలో నిర్వహించిన రూబీజెస్ట్, టెక్నికల్ ఫెస్ట్ ప్రారంభ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజ అవసరాలను గుర్తించి ఆవిష్కరణలు చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రాబోయే విద్యాసంవత్సరంలో మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులకు హాస్టల్ వసతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. కేయూ ఏ ప్లస్ గ్రేడ్ సాధించటంలో ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రాంగణ నియామకాలు ప్రధాన భూమికను పోషించాయన్నారు. కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సదానందం మాట్లాడారు. ఈ టెక్నికల్ ఫెస్ట్‌లో 10కళాశాలల విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు.

మోడల్స్‌ను తిలకించిన వీసీ, రిజిస్ట్రార్

ఇంజనీరింగ్ విద్యార్థులు ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ కంప్యూటర్స్ సైన్స్ ఇంజనీరింగ్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ మోడల్స్‌ను విద్యార్థులు ప్రదర్శించగా.. వీసీ, రిజిస్ట్రార్ పరిశీలించారు.

కేసు విచారణ వేగంగా చేపట్టాలి

- కాజీపేటలో రైలు బోగిలను పరిశీలించిన రైల్వే ఎస్పీ



దగ్ధమైన రైలు బోగిని పరిశీలిస్తున్న ఎస్పీ సలీమా

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ రైల్వే యార్డులో మంగళవారం జరిగిన నిరుపయోగంగా నిలిపిఉన్న ప్యాసింజర్ రైలు బోగి దగ్ధమైన ఘటన కేసు విచారణ వేగంగా చేపట్టాలని సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ సలీమా అన్నారు. బుధవారం ఆమె ఘటనా స్థలాన్ని పరిశీలించారు. యార్డులో దగ్ధమైన రైలు బోగి, పరిసర ప్రాంతాలను పరిశీలించి రైల్వే పోలీసులతో చర్చించారు. కేసు పురోగతిపై పలు సలహాలు, సూచనలు చేసి కేసు విచారణను వేగంగా చేయాలని ఆదేశించినట్లు రైల్వే పోలీస్ అధికారులు తెలిపారు. కాజీపేట రైల్వే డీఎస్పీ తాళ్లపల్లి కృపాకర్, సికింద్రాబాద్ అర్బన్ డీఎస్పీ జావిద్, సీఐ రాంమూర్తి, ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు, జీఆర్పీ ఎస్సై మొహినుద్దీన్ ఉన్నారు.

ఆలోచింపజేస్తున్న నాటికలు

వర్ధన్నపేట: భారతీయ నాటక కళాసమితి స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలను బుధవారం నాలుగో రోజు విద్యుత్ ఏడీఈ రాజు, ఏఈ తరుణ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చే సి ప్రారంభించారు. మొదటి నాటిక గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి 'మూల్యం' ప్రదర్శించారు. వివాహిత వివక్షకు వ్యతిరేకంగా పోరాడి తన హక్కును సాధించిన ఘటన ఈ నాటిక సారాంశం. కాగా, రెండో నాటిక మైత్రి కళానిలయం, విజయవాడ వారి 'బంధం'. మనిషి జీవితంలో భార్యభర్తల బంధం ఎంతో పటిష్టమైనది. భార్యభర్తల బంధం ఎలాంటిదో ప్రేక్షకులకు కళ్లకు కట్టినట్లు ఈ నాటికలో ప్రదర్శించారు.



బంధం నాటికలోని ఓ సన్నివేశం

అప్పుల బాధతో డ్రైవర్ ఆత్మహత్య



నరేష్(ఫైల్)

సంగెం: వరంగల్ జిల్లా సంగెం మండలంలో అప్పుల బాధ తాళలేక ఓ ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గవిచర్ల గ్రామానికి చెందిన గుళ్లపల్లి కుమారస్వామి(42) ట్రాక్టర్ కొనుగోలు చేసి నడుపుతూ.. కుటుంబాన్ని పోషించుకునేవాడు. రూ.9లక్షలు బ్యాంకులోను తీసుకుని ఇల్లు నిర్మించాడు. దీనికి తోడు బయట రూ.12లక్షలు అప్పులు చేశాడు. ఈక్రమంలో డబ్బులు సర్దుబాటు కాకపోవడంతో ఆరు నెలలుగా అప్పు కిస్తీలు చెల్లించలేదు. అప్పుల భారం పెరిగిపోతుందనే బాధతో తాగుడుకు బానిసై పనికి వెళ్లడం మానేశాడు. దీంతో భార్య హేమలత మందలించింది. మనస్తాపానికి గురైన కుమారస్వామి బుధవారం కుటుంబసభ్యులను ఇంట్లోంచి నెట్టివేసి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దొనికెల శ్రీకాంత్ తలుపులు తొలగించి వెళ్లి ఉరినుంచి తీసేసరికే కుమారస్వామి మృతి చెందాడు. మృతుడికి భార్య హేమలత, కుమారులు మహేష్, రాంచరణ్ ఉన్నారు. కుమారస్వామి తల్లి యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ వెల్లడించారు.

చనిపోయిన వారు పిలుస్తున్నారని మహిళ..



రాధిక (ఫైల్)

రఘునాథపల్లి: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని ఖిలాషాపూర్ గ్రామానికి చెందిన ఓ వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యామంకి సుధాకర్– రాధికలకు 15సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు చరణ్, భూమిక ఉన్నారు. ఇటీవల బంధువు మృతి చెందగా భార్యభర్తలు అంత్యక్రియలకు వెళ్లి వచ్చారు. అప్పటి నుంచి రాధిక వింతగా ప్రవర్తిస్తోంది. బుధవారం సోదరుడు శ్రీనివాస్‌కు ఫోన్ చేసిన రాధిక ఇటీవల మరణించిన ఆమె తనను రమ్మంటుందని, వెళ్తున్నానని చెప్పింది. ఈ విషయం రాధిక భర్త సుధాకర్‌కు శ్రీనివాస్ ఫోన్ చేసి చెప్పాడు. పనులకు వెళ్లిన సుధాకర్ వెంటనే ఇంటికి వెళ్లి చూడగా రాధిక (33) ఫ్యాన్‌కు ఉరి వేసుకొని వేలాడుతోంది. ఉరి నుంచి విడదీయగా అప్పటికే మృతి చెందింది. గతంలోనూ రాధిక రెండు పర్యాయాలు ఆత్మహత్యకు యత్నించిందని గ్రామస్తులు చెబుతున్నారు. మృతురాలి సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

‘కాళేశ్వరం’ ముస్తాబు

నేటినుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు
- ఏర్పాట్లు చేసిన అధికారులు, నిర్వాహకులు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరాలయంలో (నేడు)గురువారం నుంచి శనివారం వరకు మహాశివరాత్రి ఉత్సవాలను దేవదాయధర్మాదాయశాఖ అధికారులు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి వార్ల ఆలయంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, శివకల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం కాళేశ్వారాలయంలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఉపవాస దీక్షలు, జాగరణ, ఆలయంలో ప్రత్యేక అభిషేక, అర్చన పూజలను నిర్వహిస్తారు. శుభానంద– ముక్తీశ్వరుల కల్యాణం ముత్యాల తలంబ్రాలతో నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కల్యాణానికి హాజరు కానున్నారు.

పూజాకార్యక్రమాలు..

7న ఉదయం 10గంటలకు దీపారాధన, గణపతి పూజ స్వస్తిపుణ్యాహవచనం, రక్షాబంధనము, దీక్షా వస్త్రధారణ, ఋత్విగ్వర్ణన మృత్సంగ్రహణము. 11గంటలకు దేవతాహ్వానం నవకలశారాధన, నవగ్రహారాధన. మండప దేవతారాధన, వృషభధ్వజ పటాదివాసము పూజలు. సాయంత్రం 4గంటలకు అగ్ని ప్రతిష్ఠ, రుద్రహవనం. రాత్రి 8గంటలకు ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, ఎదురుకోలు సేవ కార్యక్రమం. 8.30గంటలకు ప్రసిద్ధ కళాకారులచే భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు.

- 8న సాయంత్రం 4–35 గంటలకు కల్యాణం, అక్షతారోహణం, రాత్రి 8గంటల నుంచి హరికథా కాలక్షేపం, సాంస్కృతిక కార్యక్రమాలు. అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవపూజ, చండీ హోమం కాళరాత్రి హోమం నిర్వహిస్తారు.
- 9న ఉదయం కాళేశ్వర ముక్తీశ్వరస్వామి వారికి మహన్యాస పూర్వక, రుద్రాభిషేకం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12గంటలకు పూర్ణాహుతి, సదస్యము, మహదాశీర్వచనం, పండిత సన్మానం.



శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి జోడు లింగాలు

ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు



అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది. 50వేల లడ్డు, 20వేల పులిహోర ప్యాకెట్లు తయారు చేస్తున్నాం. ప్రత్యేకంగా క్యూ, అదనంగా సిబ్బంది, అర్చకులను తీసుకున్నాం. ఈసారి కల్యాణం వీక్షణకు ఎల్‌ఈడీ తెర ఏర్పాటు చేస్తున్నాం.

–మారుతి, ఇన్‌చార్జ్ ఈఓ, కాళేశ్వరం దేవస్థానం

- సాయంత్రం 4గంటలకు ఆదిముక్తీశ్వర స్వామి వారికి కల్యాణం వేదపండితులచే నిర్వహిస్తారు. రాత్రి 8గంటలకు నాకబలి, అనంతరం పవళింపు సేవ కార్యక్రమాలతో శివరాత్రి ఉత్సవాలు ముగుస్తాయి.
- మహాశివరాత్రి రోజు శివకల్యాణం చేయించే భక్తులు రూ.1,000/– చెల్లించి రశీదు పొందాలని దేవస్థానం అధికారులు తెలిపారు.



గోదావరి వద్ద ఏర్పాటు చేసిన నల్లాలు, దుస్తులు మార్చుకునే గదులు